www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 జనవరి 2025

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్ నూతన సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు తప్పకహా జరుకావాలని ఆదేశించారు. నియోజవర్గ, మండల ప్రజాసమస్యల పరిష్కారవేదికల్లో మండలస్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

కానిస్టేబుల్ అప్పీల్ కార్యక్రమం వాయిదా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈ నెల 20వ తేదీన జరగవలసిన కానిస్టేబుల్‌ల అప్పీల్ కార్యక్రమాన్ని ఈనెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ పెరేడ్ గ్రౌండ్‌లో చిత్తూరు ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు జరుగుతున్న కానిస్టేబుళ్ల దేహదారుఢ్య, శారీరక పరీక్షలు శనివారానికి ముగిశాయని, అప్పీల్ చేయదలచిన అభ్యర్థులు 20వ తేదీన రావాల్సి ఉండగా చిత్తూరు జిల్లాలో అకాల వర్షాల కారణంగా ఈనెల 22వ తేదీనకు వాయిదా వేసినట్టు తెలిపారు. అప్పీల్ చేయదలచిన అభ్యర్థులు ఇది గమనించి ఈనెల 22వ తేదీన పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు రావాలని కోరారు. భర్తీ ప్రక్రియకు సంబంధించి ఎవరైనా మోసం చేయాలని ప్రయత్నిస్తే డయల్ 112 లేదా 9440900005కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాల సేకరణ

21న రాజీవ్ రంగజన్ మిశ్రా జిల్లాకు రాక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎస్సీ వర్గీకరణపై ఏక సభ్యకమిషన్ రాజీవ్ రంగజన్ మిశ్రా ఈనెల 21వ తేదీ చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. 21వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం, 11 గంటలకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో ఎస్సీ సంఘాలు, ఇతరుల నుండీ ప్రజా అభిప్రాయాలను సేకరిస్తారు. ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిటికి నూతన చిత్తూరు, తిరుపతి జిల్లాకు చెందిన దళిత సంఘాలు, ఇతరులు తమ అభిప్రాయాలను వినతిపత్రాల ద్వారా లిఖిత పూర్వకంగా తెలియజేయడంతోపాటు తమ అభిప్రయాలను కమిషన్ దృష్టికి తీసుకుపోవచ్చు. ప్రభుత్వశాఖలు, విద్యా సంస్థలు షెడ్యూల్ కులాల ఉపవర్గాలకు ఉన్న ప్రాతినిధ్యం, సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్యాపరంగా వెనుకబాటు తనం వంటి అంశాలపై అభిప్రాయాలను సేకరించనున్నారు.

ఏనుగుల దాడిలో

యువకుడి మృతిపై ఎంపి దిగ్భ్రాంతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మారుపూరి రాకేష్ చౌదరి ఏనుగుల దాడిలో దుర్మరణం చెందడంపై చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఘటనాస్థలికి చేరుకుని మృతుడు భౌతికదేహాన్ని పరిశీలించి, రాకేష్ చౌదరి ఏనుగుల దాడిలో మృతిచెందడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని ఎంపీ అభినందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కుప్పం రెడ్డమ్మ పురస్కారానికి రచనలు ఆహ్వానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాలకు రచనలు ఆహ్వానిస్తున్నట్లు కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ పి.రోజాప్రియ, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన కవులు, రచయితలు తమ రచనలు పోటీకి పంపడానికి అర్హులని, 2024 సంవత్సరంలో ముద్రితమైన లేక ఆవిష్కరించిన పుస్తకాలు మాత్రమే పంపాలని కోరారు. రచనలు, నవలలు, చందో పద్యకవిత్వం, వచన కవిత్వం రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్ హోమ్, 17-434 సుందరయ్య వీధి చిత్తూరు 517002 చిరునామాకు వచ్చే నెల ఫిబ్రవరి 10వ తేదీ లోపల పంపాలని కోరారు. ఉత్తమరచనకు రూ.10వేలు అందించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధిలో చిత్తూరు జిల్లా టాప్ టు

ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం తెలుగుదేశం నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్ళుగా ముందుకు సాగుతున్నట్లు తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చూడ చైర్మన్ కటారి హేమలత, నాయకులు కోదండ యాదవ్, మోహన్ రాజ్ అన్నారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పరిపాలన ప్రజాప్రతినిధుల పనితీరును సమీక్ష చేసి కూటమి ప్రభుత్వ పరిపాలనలో ప్రజాసంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పరిపాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని ప్రజా ప్రతినిధుల బాధ్యతల నిర్వహణలో చిత్తూరు జిల్లా 2 వ స్థానంలో ఉన్నదని ప్రకటించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో అరాచక వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపి కూటమి ప్రభుత్వానికి ప్రజలు అధికారం అప్పగించారని నారా చంద్రబాబు నాయుడు సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి రాష్ట్రంలో సుపరిపాలన ప్రారంభమైందన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు గతంలో ఎప్పుడూ ఏ ఎంపీ చేయని విధంగా మొదటి 6 నెలల కాలంలోనే 5 కోట్లు ఎంపీ ల్యాడ్స్ నిధులు విడుదల చేయించి గ్రామాలు, పట్టణాలలో సిమెంట్ రోడ్లు , డ్రైనేజీ పనులు, శ్మశాన వాటికల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి జయచంద్ర నాయుడు, కార్యాలయం కార్యదర్శి మోహన్ రాజ్, మేషక్, విజయ్ కుమార్ పాల్గొన్నారు .

లీడ్ షోష్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి- వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపలం జంక్షన్‌లో లీడ్ - షోష్ ఎలక్ట్రానిక్ షోరూంను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ ప్రారంభించారు. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన షోరూంను ప్రారంభించారు. అనంతరం షాప్ యజమాని నీలారెడ్డితో ముచ్చటించారు. ప్రజలకు ఏపె బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయని ఆరా తీశారు.

పగలే వెన్నెల..

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని పెద్దకాల్వ, వరత్తూరు, తూగుండ్రం, వేపంజేరి, అగర మంగళం పంచాయతీల పరిధిలలో ఉన్న కొన్ని గ్రామాల పురవీధులలో విద్యుత్ స్తంభాల ఎల్ఈడి బల్బులు 24 గంటలు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం విద్యుత్ ఆదా చేయాలని ఆకాంక్షిస్తున్న పంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ దీపాలు రాత్రిపూట మాత్రమే వెలిగేలా చర్యలు చేపట్టి విద్యుత్ ఆదా చేయాలని గ్రామస్తులు వాపోతున్నారు.

లైట్లు పగలే వెలుగుతున్న దృశ్యం

రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గుడిపాల మండల పరిధిలో చిత్తూరు - వేలూరు రోడ్డులో చెన్నై క్రాస్ జంక్షన్ నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్‌తో కలసి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. వేలూరు రోడ్డులో వై జంక్షన్ నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు రోడ్డు గుంతలమయమై వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో రోడ్డును అభివృద్ధి చేయడం కోసం ఇటీవల జిల్లా కలెక్టర్, ఎంఎల్ఏ కలిసి గత నెలలో ఇరువురు రోడ్డును పరిశీలించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు, వాటి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. వేలూరు రోడ్డులో వై జంక్షన్ నుండి ఆంధ్ర సరిహద్దు వరకు 1.6 కిలోమీటర్ల మేర పాడైన రోడ్డును పుర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టడానికి ఎన్ఆర్ ఈజీఎస్ కింద రూ.2.30కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రహదారుల అభివృద్ధి పనులు ఊపందు కున్నాయన్నారు. పిఆర్ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసులు, డీఈ దస్తగిరి, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ శివరాజ్, సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న జిల్లా కలెక్టర్

విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఏ

విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ

ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం గుడిపాల మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జిల్లా పరిషత్ గుడిపాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్, ఎంఎల్ఏ సైకిళ్ళు పంపిణీ చేశారు.

ప్రజాకవి యోగి వేమన

వేమన పద్యాలు తెలుగు వారికి సుపరిచితం: కలెక్టర్

యోగి వేమన చిత్రపటానికి నివాళ్ళు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పిన ప్రజాకవి వేమన అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా సచివాలయంలోని పాత గ్రీవిన్స్ హాల్‌లో ప్రజాకవి శ్రీ యోగి వేమన జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ పాల్గొని యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాలు తెలుగు వారికి సుపరిచితమని, ఆటవెలదిలో సరళమైన రీతిలో హదయాలకు హత్తుకునే విధంగా పద్యరచన చేశారన్నారు. యోగి వేమన జయంతిని ప్రతి సంవత్సరం జనవరి 19న రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సమాజ చైతన్యానికి అవసరమైన సలహాలు, సూచనలు, విలువలతో కూడిన రచనలు చేసే వారన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ భాష, పిఆర్ఎస్ఈ చంద్ర శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి ఆధ్వర్యంలో యోగి వేమారెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని నాగమంగళం వద్దనున్న యోగి వేమారెడ్డి ఉద్యానవనంలో యోగివేమన విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం వందకు పైగా వేమన పద్యాలు ఆలపించిన చిన్నారులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందజేశారు. అనంతరం కవులు రచయితలైన డి. కుమారస్వామి రెడ్డి, డాక్టర్ మల్లిచెట్ల దేవేంద్ర, గండికోట వారిజ, రెడ్డిప్రకాష్ అశోక్, బాలకృష్ణమూర్తిను ఘనంగా సత్కరించారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జగ్గయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు సోమసుందర్ రెడ్డి, ఉమాదేవి, మీనాక్షి, వీకోట బైరెడ్డిపల్లి మండలాల అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ, పెద్దపంజాని మాజీ ఎంపీపీ విజయ భాస్కర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం సలహాదారు రెడ్డివారి అమర్నాథ్ రెడ్డి, టమోటా మండి యజమాని జయరామిరెడ్డి పాల్గొన్నారు.

పలమనేరులో..

'కుల గణన తరువాతే ఎస్సీ వర్గీకరణ చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కుల గణన జరిగిన తరువాతే ఎస్సీ వర్గీకరణకు చర్యలు చేపట్టాలని దళిత సంక్షేమ సేవా సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు క్రిమిలేయర్‌ను అమలు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం అందించే రాయితీలు కిందిస్థాయి వరకు చేరడం లేదన్నారు. దీంతో అభివృద్ధి నెరవేరడం లేదని వాపోయారు. గత ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధిని అనగదొక్కిందని.. నూతన కుటమి ప్రభుత్వమైన తమకు న్యాయం చేసేలా కృషి చేయాలని, ఎస్సీ ఎస్టీకి కేటాయించిన నిధులను వారి అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని విన్నవించారు. చిత్తూరు జిల్లా అధ్యక్షులు శివాజీ, గోపాలయ్య గోపీనాథ్, సాగర్ పాల్గొన్నారు.

ఉరకలేసిన ఉత్సాహం

రంకెలేసిన కోడిగిత్తలు

తిలకించడానికి వచ్చిన వేలాది జనం

ప్రజాశక్తి- సోమల: జిల్లాలోని అత్యంత వేడుకగా కోలాహలంగా నిర్వహించే సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి పశువుల పండుగ ఆదివారం చిరుజల్లులను కూడా లెక్కచేయకుండా భారీగా తరలివచ్చిన జన ఉత్సాహం నడుమ కోడెగిత్తలు రంకెలు వేస్తూ పరుగులు తీస్తుంటే వాటిని పట్టుకునేందుకు యువకులు ఉత్సాహం చూపిస్తూ ఉంటే కన్నుల పండుగగా పశువుల పండుగను (జల్లికట్టు) నిర్వాహకులు నిర్వహించారు. ప్రతి ఏడాది వచ్చే భోగి కనుమ సంక్రాంతి పండుగ తరువాత వచ్చే ఆదివారం రోజు పెద్ద ఉప్పరపల్లిలో తరతరాలుగా పశువుల పండుగ నిర్వహించడం జరుగుతూ వస్తూ ఉంది. ఈ ఆదివారం పెద్ద ఉప్పరపల్లెలో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జల్లికట్టు నిర్వహిస్తామని దండోరా వేసి నిర్వాహకులు ప్రకటించడంతో తిలకించడానికి సోమల, చౌడేపల్లి, సదుం, తిరుపతి, పాకాల, పుంగనూరు తదితర ప్రాంతాల నుండి భారీగా యువకులు మహిళలు హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు జల్లికట్టు నిర్వహించడానికి పచ్చ జెండా ఊపగా కోడిగిత్తలను గ్రామంలోని పశువులను వాటి యజమానులు పసల మంద ప్రాంతానికి తీసుకువచ్చారు. అందంగా అలంకరించిన కొమ్ములకు బహుమతులు కట్టిన కోడిగిత్తలను అల్లి మీదుగా ఒక్కొక్కటి వదులుతూ ఉంటే వాటిని పట్టుకునేందుకు యువకులు ఉత్సాహం చూపించారు. మిద్దెలు మేడలు మొత్తం జల్లికట్టు తిలకించడానికి వచ్చిన వారితో నిండిపోయాయి. జల్లికట్టు ప్రారంభమైన తరువాత కొందరికి ఎద్దులను పట్టుకునే క్రమంలో స్వల్ప గాయాలు కాగా వెనువెంటనే సమీపంలోని పెద్ద ఉప్పరపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్సలు అందించారు. పోలీసులు పూర్తిస్థాయిలో బందోబస్తు నిర్వహించారు. కాగా జల్లికట్టు నిర్వహణలో పార్టీలకు అతీతంగా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించడంతో ఎలాంటి ఘర్షణలు గొడవలు జరగకపోవడంతో నిర్వాహకులు పెద్ద ఉప్పరపల్లి గ్రామస్తులు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

జల్లికట్టు తిలకించడానికి వచ్చిన అశేష జనవాహిని

ఎద్దులను పట్టుకునే క్రమంలో కిందపడిన యువకులు

ఇసుక కొరత రాకుండా చర్యలు

జిల్లా మైన్స్ అధికారి సత్యనారాయణ

ఇంటర్వ్యూ

సత్యనారాయణ, జిల్లా మైన్స్ అధికారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఇసుక కొరత వల్ల నిర్మాణాలు ఆగిపోకుండా ఉండేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ అభివృద్ధి పనులు, గృహ నిర్మాణం ఇతర నిర్మాణాలకు ఇసుక కీలకం జిల్లాలో ఉన్న ఇసుక నిల్వలు తగ్గిపోతే ఇసుక కొరత ఏర్పడు ప్రమాదం ఉంది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుక కొరత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ మైన్స్, రెవెన్యూ ఇతర శాఖల అధికారులతో చర్చించి ప్రభుత్వ ఆమోదం మేరకు చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. సహజ వనరు అయిన ఇసుక విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ తీయడానికి వీలుండదు. ఇందు కోసం ప్రభుత్వం కొన్ని సూచనలు చేసింది. వాటిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అలాగే సుప్రీమ్ కోర్టు ఆదేశాలను అనుసరించాల్సి ఉంటుందని జిల్లా మైన్స్ అధికారి సత్యనాయణ తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలను తెలియజేస్తూ...

ప్రజాశక్తి : చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్‌లు ఎన్ని లభ్యత ఎంత..?

మైన్స్ డిడి: జిల్లాలో ప్రస్తుతం దిగువ మాసాపల్లి ఇసుక రీచ్ మాత్రమే అందుబాటులో ఉంది. ఇక్కడి లభ్యత 35 జీబిలో 30వేల మెట్రిక్ టన్నులు తీసుకొనే అవకాశముంది. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఇసుక తీసే అవకాశాలను పరిశీలిస్తున్నాం.

ప్రజాశక్తి : వంకలు, వాగులో ఇసుక తీసుకొనే అవకాశాలు ఉన్నాయా..?

మైన్స్ డిడి: ప్రస్తుతానికి జిల్లాలో 24 వంకలు, వాగుల్లో 44 ఇసుక రీచ్‌లు గుర్తించడం జరిగింది. స్థానిక అవసరాల కోసం యంత్రాలతో కాకుండా కూలీల ద్వారా ట్రాక్టర్లలో మాత్రమే ఇక్కడి నుంచి ఇసుక తీసుకోవచ్చు.

ప్రజాశక్తి : ప్రస్తుతం ఇసుక ధర ఎలా ఉంది..?

మైన్స్ డిడి: ప్రస్తుతం జిల్లాలో లభ్యత ఉన్న దిగువమాసాపల్లి ఇసుక రీచ్ వద్ద టన్ను ఇసుక రూ.90లు అందివ్వడం జరుగుతోంది. దూరాన్ని బట్టి వాహన అద్దెలు వేరువేరుగా ఉంటాయి.

ప్రజాశక్తి: ఇసుక స్టాక్ పాయింట్ల ఏర్పాటు ఎంత వరకు వచ్చింది..?

మైన్స్ డిడి: జిల్లాలోని వేరువేరు ప్రాంతాల్లో ఇసుక స్టాక్‌పాయింట్ల ఏర్పాటు కోసం ఆసక్తి కలిగిన వారి నుండీ ప్రభుత్వ నిబంధన మేరకు స్థలం, వాహనాలు కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరడం జరిగింది. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కాకపోవడంతో పెండింగ్‌లో ఉంది.

ప్రజాశక్తి : ఇసుక కొరత తీర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

మైన్స్ డిడి: ఇసుక కొరత తీర్చేందుకు ఇతర జిల్లాల నుంచి మన జిల్లాలో ఇసుక తీసుకొచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించడం జరుగుతోంది. అలాగే మన జిల్లాలోని ఇసుక లభ్యత గల ప్రాంతాలను గుర్తిస్తున్నాం.

పింఛను మంజూరు చేయండయ్యా..!

పింఛను కోసం ఎదురు చూస్తున్న తులసమ్మ

ప్రజాశక్తి- విజయపురం : సారూ.. నాకు పింఛను మంజూరు చేయండి.. అంటూ మండలంలోని కమ్మకండ్రిగకు చెందిన 63 సంవత్సరాల వృద్ధురాలు, వితంతువు తులసమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తన భర్త రాధాకృష్ణా పింఛను పొందుతూ గత సంవత్సరం మృతి చెందారని, అప్పటి నుండి పింఛను కోసం ప్రతి ఆఫీసు మెట్టు ఎక్కినా ప్రయోజనం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త సెంటు భూమి లేని కల్లుగీత కార్మికుడని, తనకు ఒక కుమార్తె ఉందని, ఆమెను తమిళనాడులో ఇచ్చి వివాహం చేశామని, వస్తున్న పింఛనుతో జీవనం సాగిస్తూ వస్తున్నామని తెలిపారు. భర్త చనిపోవడంతో పూరిగుడిసెలో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నామని కంటతడి పెట్టారు. సంవత్సరం రోజులుగా తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు కరుణించాలని ప్రాధేయపడుతున్నారు.

విద్యార్థులలో క్రీడా చైతన్యమే లక్ష్యం

ప్రజాశక్తి- గంగవరం: విద్యార్థులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తి కల్పించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ క్రీడా మంత్రిత్వ శాఖ ద్వారా చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం, గంగవరం సంజీవని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్ విభాగంలో గంగవరం వినాయక టీం మొదటి బహుమతి, శివాడి వివేకానంద టీం రెండవ బహుమతి, బ్యాడ్మింటన్ విభాగంలో టి.కిరణ్ కుమార్ మొదటి బహుమతి, ఎన్.నవీన్ బాబు రెండవ బహుమతి గెలుపొందారు. విజేతలకు, పాల్గొన్న క్రీడాకారులకు జిల్లా నెహ్రూ యువ కేంద్ర, సంజీవని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, పతకాలను ప్రదానం చేశారు. ఇక్కడ గెలుపొందిన వారిని ఈ నెలాఖరులో జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చిత్తూర్ డిస్టిక్ యూత్ కోఆర్డినేటర్, సంజీవిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, స్వాభిలంబిన భారత్ అభియాన్ డిస్టిక్ కన్వీనర్, యుఎస్.ఉమామహేష్, శ్రీపురం సీతారామయ్య జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రూపాదేవి, ఉపాధ్యాయులు మల్లిచెట్ల దేవేంద్ర, జిల్లా గ్రామవార్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో తప్పని తిప్పలు

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని శనివారం రాత్రి, ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో మళ్లీ చెరువులన్నీ నిండు కుండలా మారాయి. మండలంలోని పాతార్కాడు, మంగళం, శ్రీహరిపురం, మహవీరపురం, పన్నూరు చెరువులు మొరవ పారాయి. మండలంలోని ఇళ్ళత్తూరు వద్ద చెరువు మరవ కాలువ ఆక్రమణకు గురికావడంతో వరద ఉధృతి నీరు ఇళ్ళత్తూరు - చివ్వాడ రోడ్డుపై పారడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ విషయమై అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కమ్మకండ్రిగలో నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరిపంట నేలకొరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

కమ్మకండ్రిగ వద్ద నేలకొరిగిన వరిపంట

పొలాలపై ఏనుగుల గాడి

గడ్డి కత్తిరించే యంత్రాలను ధ్వంసం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: శనివారం రాత్రి మండలంలోని మొగిలిగ్రామంలోని పంట పొలాలపై ఏనుగులు దాడి చేశాయి. అలాగే నారాయణమ్మకు సంబంధించిన పాడి ఆవులకు గడ్డి కత్తిరించే యంత్రాలను, షెడ్డును ఏనుగులు ధ్వంసం చేశాయని, రూ.75 వేల నష్టం వాటిల్లినట్టు మహిళ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులు తరచు పంట పొలాలపై పడి పంటలను తిని తొక్కి ధ్వంసం చేస్తున్నాయని, కష్టపడి పండించిన పంట చేతికందకుండా పోతుందని వాపోయారు. పొలాల్లో పనులు చేయాలన్న ఏ వైపు నుండి ఏనుగుల గుంపు దాడులు చేస్తాయని భయం గుప్పెట్లో రైతులు ఉన్నారని సంబంధిత అధికారులు ఏనుగులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సజ్జలని కలిసిన ప్రముఖులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వైసిపి రాష్ట్ర నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదివారం చిత్తూరులో ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పనిచేయాలని, ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజలకు తెలియజేయాలన్నారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, డాక్టర్ సునీల్ కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజా, విజయానంద రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి సజ్జలను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- రొంపిచెర్ల : మండలంలోని మంగళంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979-80వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం 45 సంవత్సరాల తర్వాత కలుసుకొని పాత రోజులు గుర్తు తెచ్చుకొని ఉల్లాసంగా గడిపారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఒకరునొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులు హరినాథ్ వ్యాయామ ఉపాధ్యాయులు, ఎర్రయ్య సోషల్ టీచర్, అబ్దుల్ మునాఫ్ హిందీ టీచర్లను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రస్తుత పాఠశాల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని అన్నారు.

నేడు పింఛన్ లబ్ధిదారుల
ఇళ్ల వద్ద తనిఖీలు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం

పింఛన్ తీసుకునే లబ్ధిదారుల ఇంటి వద్దకే తనిఖీ నిమిత్తం వైద్య బృందం వస్తుందని సంక్షేమ, విద్యా సహాయకులకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో మోహన్ మురళీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 20వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం లోగా రూట్ మ్యాప్ మేరకు మంచానికే పరిమితమైన, పక్షవాతం వచ్చి పింఛను పొందుతున్నటువంటి లబ్ధిదారుల ఇంటి వద్దకు తనిఖీ నిమిత్తం వైద్యబృందం వస్తుందని అందరూ సంక్షేమ విద్యా సహాయకులు మీ పరిధిలోని ఫించనుదారులను ఇంటి వద్దనే అందుబాటులో వుండవలసినదిగా చూడాలన్నారు. అదే విధంగా ఒక బయోమెట్రిక్ పరికరం వెంట తీసుకుని హాజరు కావలసినదిగా ఆదేశించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -సదుం: బూరగమంద గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా విగ్రహావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిధున్ రెడ్డి పాల్గొని విగ్రహావిష్కరణ చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్ప, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు, డాక్టర్ యమలా సుదర్శనం, తిరుపతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్ సభ్యులు పరమశివన్, పుష్పరాజు, డాక్టర్ ప్రసాద్‌రావు, ధనశేఖర్, వైసిపి నాయకులు పి.పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున, సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో
తిరుపతి జిల్లా ఎస్ఎఫ్ఐ మహాసభలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 5వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక ఎస్వి యూనివర్సిలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు అక్బర్, రవి మాట్లాడుతూ తిరుపతి జిల్లా మహాసభ లు యూనివర్సిటీలో ఈనెల 28,29 తేదీలలో నిర్వహిస్తామని, గత కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు ఉద్యమాలను రూపలక్పనకు ఈ5వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. టెంపుల్ సిటీలో టీటీడీ విద్యా సంస్థలు తప్ప ప్రభుత్వ విద్యా సంస్థలు లేక స్థానిక పేద విద్యార్థులు వేల రూపాయలు చెల్లించక ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోను ప్రభుత్వ విద్యా సంస్థల సమస్యలు అనేకం నెలకొన్నాయని, విద్యార్థులకు అనుగుణంగా వసతి గృహాలు లేక వేల మంది విద్యార్థులు పీజీలో ఉంటూ ఆరు వేలు చెల్లించలేక ప్రత్యామ్నాయంగా పార్ట్ టైం జాబ్ లు చేస్తూ విద్య రెగ్యులర్‌గా కొంసాగించలేక పక్క దారి పడుతున్నారని వాపోయారు. టీటీడీ విద్యా సంస్థలో సీటు వచ్చిన విద్యార్థులకు అనుగుణంగా హాస్టల్ లేక అవస్థలు పడుతున్నారని, పాలిటెక్నిక్ కళాశాల ఉన్న పురాతన భవనం వర్షం పడితే పెంకులు ఎప్పుడు ఊడి పడి విద్యార్థుల తలలు పగులుతాయో తెలియని ఆందోళనలో విద్యార్థులు ఉన్నారన్నారు.

శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి- శాంతిపురం: రాళ్ళబూదుగూరులోని పురాతన శ్రీ కోదండరామస్వామి వారి దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించారు. కుప్పం నియోజకవర్గం పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ కోదండ రామస్వామి దేవాలయ అభివృద్ధి కొరకు సుమారు 7కోట్ల 80 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా విజయవాడ నుండి దేవాదాయ శాఖ అధికారులు పనులు ప్రారంభించడానికి దేవాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు దేవాలయానికి అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఈ దేవాలయాన్ని ఒక పర్యటక ప్రాంతంగా చేయడానికి పూనుకున్నారని, దశల వారీగా 20 కోట్ల రూపాయలతో దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్టు ఆయన తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని ముఖ్యమైన దేవాలయాలను అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలోని పలు దేవాలయాలను అభివృద్ధి పరచడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. త్వరలోనే దేవాలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎపిఎస్ఆర్టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, దేవాదాయ శాఖ సహాయక కమీషనర్ నెహ్రూ అమరావతి, డీఈ చక్రధర్, ఏఇ ఆనంద్, సహాయక ఏఈ దుర్గప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, ఆర్ఎస్ ముని చంద్ర తదితరులు పాల్గొన్నారు.

'జనహిత' సేవలను సద్వినియోగం చేసుకోండి..

ప్రజాశక్తి- కార్వేటినగరం: స్వయం కృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను విశ్రాంతి ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి (డైట్ అధ్యాపకులు) చెంగల్రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ విశాంత్రి ఉద్యోగుల సంఘం భవనంలో సత్యవేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం భారతి ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలి పెన్షనర్లకు ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ఏడాది పెన్షనర్లు సమర్పించే లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించడంలో తమ సంస్థ ప్రతి ఏడాది ఉచిత సేవలు అందిస్తోందన్నారు. అదే విధంగా ఆనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారిని విధిగా గుర్తించి వారికి కూడా ఇంటి వద్దకు వెళ్లి సేవలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం విశ్రాంతి హెచ్ఎం విజయకుమార్ పిళ్లై మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఇంటికే పరిమితమైన విశ్రాంతి ఉద్యోగులు నగరి, పుత్తూరులోని ట్రెజరీలకు వెళ్లకుండా ఒక్కచోటే లైఫ్ సర్టిఫికేట్లు అందిస్తున్న స్వయం కృషి జనహిత స్వచ్ఛంద సంస్థ వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. విశ్రాంతి ఉద్యోగుల మండల అధ్యక్షుడు మోహన్రెడ్డి, ప్రధాన కార్యదర్శి బెంగమ్మ, సుకుమారారాజు, ఉపాధ్యావాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరాజు పలువురు పాల్గొన్నారు.

వాసవి వనిత క్లబ్ నూతన అధ్యక్షులుగా రమ్య హరీష్

ప్రజాశక్తి- పలమనేరు: ఎన్నో సంవత్సరాల నుండి పలమనేరు పరిసర ప్రాంతాల్లో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. ఆదివారం శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య మండలి అధ్యక్షుడు ఆర్వి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాసవి వనిత క్లబ్ నూతన అధ్యక్షురాలుగా రమ్య హరీష్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, జిల్లా గవర్నర్ యశస్వి గుప్తా చేతుల మీదుగా రమ్య నియామకపత్రం అందుకున్నారు. రమ్య రమేష్, ఉషా ప్రకాష్, దీప్తి బాలాజీ, కవిత కుమార్, విజయ ప్రసాద్, లక్ష్మీ రాజు ఆర్ మాధవి పాల్గొన్నారు. అనంతరం పలమనేరు లోని గర్ల్స్ హైస్కూల్లో వంట రూము పై కప్పు ఉరుస్తూ ఉండడంతో పై కప్పు వేయడానికి విరాళం అందించడంతోపాటు మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

క్రైం న్యూస్

హత్యకేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులో ఈనెల 13వ తేదీన ముసలిమడుగు గ్రామానికి చెందిన శివకుమార్ హత్య జరిగిన విషయం విధితమే. పరారీలో ఉన్న ముద్దాయి సమీర్‌ను ఆదివారం మధ్యాహ్నం బంగారుపాళ్యం, మొగలి, వెంకటగిరి ఫ్లైఓవర్ వద్ద డిఎస్పి డి.ప్రభాకర్, సీఐ నరసింహారాజు, ఎస్సై స్వర్ణతేజ ఆధ్వర్యంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్పి తెలియజేశారు. శివకుమార్ భార్య ఉషారాణి స్థానిక గుడియాత్తం రోడ్డులో గల చార్మినార్ చికెన్ సెంటర్, చార్మినార్ బిర్యాని సెంటర్లో పనిచేస్తుండగా సమీర్‌కు వివాహేతర సంబంధం ఉన్నందువల్ల శివకుమార్‌ను అడ్డు తొలగించే నెపంతో హత్య చేసినట్లు ముద్దాయి అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండలంలోని గంగినాయనిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బైరెడ్డిపల్లి - పుంగనూరు జాతీయ రహదారిలో గంగినాయనపల్లి గ్రామ సమీపానగల జానూ బాష ఇంటి వద్ద ఉన్న పల్సర్ వాహనాన్ని శనివారం రాత్రి గుర్తు తెలీని దుండగులు చోరీ చేసినట్లు తెలిపారు. ఆదివారం జానుబాషా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ స్టాల్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - తడ: సూళ్లూరుపేటలోని ఫ్లెమింగో ఫెస్టివల్ మైదానంలో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, పర్యాటకులు, సామాన్య ప్రజల సందర్శకులతో విశేష స్పందన లభించింది. ఈ స్టాల్‌లో చాక్లెట్లు, ఆహార పదార్థాలు, ఎయిర్ కండీషనర్లు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్, లైట్ ఇంజినీరింగ్ రంగాల ఉత్పత్తుల నమూనాలతో శ్రీసిటీ ప్రగతిని దృశ్య మాధ్యమంగా అద్భుతంగా ప్రదర్శించారు. పారిశ్రామిక విజయాలతో పాటు, సుస్థిరత, సామాజిక సంక్షేమంపై శ్రీసిటీ నిబద్ధతను స్టాల్ హైలైట్ చేసింది. పరిశ్రమలతో పాటు హరిత హిత కార్యక్రమాలు, సమాజ శ్రేయస్సు కోసం చేపట్టిన కార్పొరేట్ సామాజిక బాధ్యతా (సియస్ఆర్) ప్రాజెక్టులు, ప్రకృతి సంరక్షణ, జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలను ప్రతిబింబించే ఆకర్షణీయ ఫొటో డిస్‌ప్లేలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శ్రీసిటీ ప్రస్థానాన్ని వివరిస్తూ సాగిన వీడియో ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. పారిశ్రామిక పురోగతినే కాకుండా స్థిరమైన అభివృద్ధిలో దానికున్న ప్రాధాన్యతను హైలైట్ చేస్తూ ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ సందర్శకులపై బలమైన ముద్రవేసింది.

శ్రీసిటీ స్టాల్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

సమాజం, పర్యావరణం పట్ల శ్రీసిటీ యాజమాన్య బాధ్యతాయుత చర్యలను సందర్శకులు ప్రశంసించారు. ఈ ప్రదర్శనను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమా శాఖ గౌరవ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించిన విషయం తెలిసిందే.. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో ప్రదర్శన ప్రాంగణంలో నీరు నిలిచినా సందర్శకులకు ఇబ్బందులు కలుగకుండా ఫెస్టివల్ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

నెత్తురోడిన రహదారి

- జక్కలవారిపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- లారీని వేగంగా ఢీకొట్టిన కారు
- ఇద్దరు చిన్నారులు, ఒక మహిళ దుర్మరణం
- ముగ్గురికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం
- బాధితులు తమిళనాడు వాసులుగా గుర్తింపు

సంఘటన స్థలంలో గుమికూడిన ప్రజలు

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి)

చంద్రగిరి మండలంలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి మరో సారి నెత్తురోడింది. జక్కలవారిపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందగా, ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు..

తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన కార్తీకేయ (50) కుటుంబ సభ్యులు సతీష్ (35), కలైవేణి (45), ఐశ్వర్య (30), జీవన్ (10), విశ్వ (06) తో కలసి తిరుమల శ్రీవారి దర్శనానికి బయల్దేరారు. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై జక్కలవారిపల్లి వద్ద వస్తున్న క్రమంలో ముందు వెళు న్న వాహనాన్ని అధిగమించే క్రమంలో చిత్తూరు వైపు వస్తున్న లారీని కారు ఢీకొంది. కారు వెళు తున్న వేగానికి కారు ముందు భాగం పూర్తిగా లారీ కిందికి దూసుకుపోయింది. ప్రమాదంలో కారులోని ఇద్దరు చిన్నారులు జీవన్, విశ్వ అక్కడికక్కడే మృతి చెందారు. కార్తికేయతో పాటు సతీష్, కలైవేణి, ఐశ్వర్యలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గుర్తిం చిన తోటి ప్రయాణికులు హుటాహుటిన ఘటన స్థలం వద్దకు చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. కారులో ఇరుక్కు పోయిన క్షతగాత్రులను బయటకు తీశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షత గాత్రులను 108 లో తిరుపతి రుయాకు తరలించారు. మృతి చెంది న చిన్నారుల మృతదేహా లను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కలైవేణి (45) మరణించింది. కార్తికేయ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న మరో ఇద్దరు క్షతగాత్రుల పరిస్థితి నిలకడగా వుంది. ముందు వెళ్లే వాహనాన్ని అధిగమించే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక అంచనా వేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి పాదాల చెంత కంపు కంపు!

- రోడ్డుకిరువైపులా కుళ్లిన వ్యర్థాలు
- చిరుతల సంచారానికి ఇదో కారణం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: శ్రీవారి పాదాల మండపం వద్ద ఉన్న అలిపిరి మార్గం దుర్గంధానికి నెలవుగా మారింది. అలిపిరి బైపాస్‌రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా మాంసం వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, బిల్డింగ్ వ్యర్థాలు నిత్యం దర్శనమిస్తాయి. ఆ మార్గాన వచ్చే భక్తులు దుర్వాసన తట్టుకోలేక ముక్కున వేలేసుకుంటున్నారు. నిత్యం ఆ మార్గంలో పయనించే అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం. చిరుతల సంచారానికి ఇదే ప్రధాన కారణం కావడం గమనార్హం.

శ్రీవారి దర్శనానికి తిరుమలకు చేరుకోవాలంటే అలిపిరి ప్రధాన మార్గం. నడకదారికి కానీ, ఘాట్‌రోడ్డు ప్రయాణానికి గాని అదే తొలి అడుగు. ఆ ప్రాంతం మొత్తం అన్నమయ్య సంకీర్తనలు నిత్యం అలరాలుతుంది. బెంగుళూరు, వేలూరు, అనంతపురం వంటి ప్రాంతాల నుంచి తిరుపతికి వచ్చే యాత్రికులు నగర ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా తక్కువ దూరంలో అలిపిరికి చేరుకునేందుకు చెర్లోపల్లి-అలిపిరి మార్గంలో 7 కిలోమీటర్ల మేర బైపాస్‌రోడ్డును ఏర్పాటు చేశారు. శ్రీనివాస మంగాపురం, శ్రీవారిమెట్టుకు వెళ్లేందుకు ఈ ప్రధాన మార్గం. ఈ మార్గంలో వేదిక్ యూనివర్సిటీ, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, అగ్రికల్చరల్ యూనివర్సిటీ, స్విమ్స్ యూనివర్సిటీ, ఎస్వి యూనివర్సిటీలు ఉన్నాయి. నిత్యం సందర్శకుల తాకిడి ఉన్న ఎస్వి జూ పార్కు, సైన్స్ సెంటర్, ప్రముఖ కంటి చికిత్సాలయం, అరవింద కంటి ఆసుపత్రి, టాటా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్వి క్యాన్సర్ ఆసుపత్రి, ఏపి టూరిజం హోటల్‌మేనేజ్‌మెంట్ కళాశాల, హాస్టల్, భారతీయ విద్యాభవన్, టిటిడి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిన్నపిల్లల హృదయాలయం, ఎస్వీబిసి కేంద్రాలకు ఆ మార్గంలోనే వెళ్లాలి. నిత్యం ప్రశాంత వాతావరణంలో, పచ్చని చెట్లతో ఆ మార్గం ఆహ్లాదకరంగా ఉంటుంది. అలాంటి ప్రాంతం అధికార్ల నిర్లక్ష్యం కారణంగా దుర్గంధానికి నెలవుగా మారింది. నగరంలోని మాంస విక్రయాల్లోని వ్యర్థాలను ఆ మార్గంలోని రోడ్డుకు ఇరువైపుల డంప్ చేస్తున్నారు. కొబ్బరి బోండాల చిప్పలు, భవన నిర్మాణాల వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, హోటళ్లో వినియోగించి ఎంగిలి విస్తర్లు తదితర వ్యర్థాలన్నిటికి డంపింగ్ కేంద్రంగా ఆ మార్గం నిలుస్తోంది. కుళ్లిన వ్యర్థాలను తినేందుకు ఆ మార్గం పొడవున కుక్కలు గుంపులు గుంపులుగా తచ్చాడుతుంటాయి. వాటి వల్ల ఆ మార్గంలో పయనించే వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కలు వాహనాలపైకి ఎగబడుతుండడంతో చిన్న చిన్న ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పైగా ఇటీవల కాలంలో చిరుతల సంచారం కూడా ఆ ప్రాంతంలో అధికమైంది. దానికి ప్రధాన కారణం వ్యర్థాల కోసం కుక్కలు రావడంతో, ఆ కుక్కల కోసం చిరుతలు అలిపిరి బైపాస్‌రోడ్డులోకి ప్రవేశిస్తున్నాయి. వీటి వల్ల వాహనదారులు, పాదచారులు, పలు యూనివర్సిటీల విద్యార్థులు, రోగులు, వారి సహయకులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవలే మిట్టమధ్యాహ్నం బైక్‌పై వెళుతున్న ఓ టిటిడి ఉద్యోగిపై చిరుత దాడి చేసిన ఘటన సైతం చోటు చేసుకుంది. ఆ మార్గం మొత్తం ఎర్రచందనం, శ్రీగంధం చెట్లతో నిండి ఉండడంతో నిత్యం ఫారెస్టు అధికారులు, సిబ్బంది ప్రహార కాస్తూనే ఉంటారు. టిటిడి ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ఆ మార్గంలో పయనిస్తూ, నిత్యం చూస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదే మార్గంలో టిటిడి సంస్థలకు నీటి సరఫరా చేసే వాటర్ ప్లాంట్ సైతం ఉండడం గమనార్హం. నిత్యం కోట్లాది రూపాయల భక్తుల సొమ్ముతో నడిచే టిటిడి, ఈ మార్గాన్ని నిత్యం పచ్చగా ఉంచేందుకు ప్రత్యేకించి కొంత సొమ్మును కూడా కేటాయించింది. వాటికి లెక్కలు చూపే అధికారులు, ఈ మార్గంపై నిఘా పెట్టకపోవడం విడ్డూరం. చిరుతలు సంచరిస్తుంటే భక్తులు, యాత్రికులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించే టిటిడి, ఫారెస్టు అదికారులు, చిరుతల సంచారానికి ప్రధాన కారణమైన వ్యర్థాలను తొలగించి, ఆ మార్గంలో వ్యర్థాలను డంప్ చేయనీయకుండా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆ మార్గంలోని వ్యర్థాలను తొలగించి, భక్తులను దుర్వాసన నుంచి రక్షించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డంతా కంపు కంపు

వెంకటేశ్వరస్వామి గుడికి వచ్చే అలిపిరి రోడ్డంతా కంపు కంపుగా వుంది. రోడ్డుకు రెండు పక్కల ఎక్కడ చూసిన చెత్తచెదారమే. వాటి కోసం కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగు తున్నాయి. ఆ రోడ్డులో వచ్చే వాళ్లపైకి విరుచుకు పడుతు న్నాయి. టిటిడి అధికారులు ఇలాంటి వాటిపై స్పందించక పోవడం బాధాకరం.

-మోహన్, ల్యాబ్‌టెక్నీషన్, బెంగుళూరు.

ముక్కున వేలేసుకోవాల్సి వస్తోంది

శనివారం స్వామికి మొక్కు చెల్లించుకోవాలని తిరుపతికి వచ్చాం. అలిపిరి వద్ద ఆగి స్వామి పాదాలకు దండం పెట్టుకుందామనుకుంటే ఆ మార్గంలో వచ్చే దుర్వాసన ఏకాగ్రతను పాడు చేసింది. మొక్కాల్సిన చోట ముక్కున వేలేసుకోవాల్సి వస్తోంది. అలిపిరికి అత్యంత దగ్గర్లోనే కుళ్లిన వస్తువులు దిబ్బలు దిబ్బలుగా ఉండడం బాధాకరం. టిటిడి ఇలాంటి వాటిపై దృష్టి సారించాలి. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామంటున్న టిటిడి, కనీసం కంపుకొట్టే పదార్థాలను కూడా తొలగించకపోవడం సరికాదు..

-మహాదేవన్, కోలార్, కర్ణాటక.

పేదవాడి యాపిల్..
సీతాఫలంతో బోలెడు ప్రయోజనాలు..

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సీతాఫలం.. ఈ పేరు చాలా మంది వినే ఉంటారు. ఈ ఫలాన్ని పేదవాడి యాపిల్‌గా పిలుచుకుంటారు. ఈ పండ్లు మార్కెట్లో కేజీ రూ.50 నుంచి 80ల ధరకు విక్రయిస్తున్నారు. దీంతో పేదవాడి యాపిల్ కాస్తా క్లాస్టీ యాపిల్‌గా మారింది. పట్టణాల్లో అయితే కేజీ రూ.100లు కూడా పలికిన రోజులున్నాయి. దీంతో మండలంలోని చాలా మంది అటవీ ప్రాంతంలోని సీతాఫలం కాయలను కోసి మాగబెట్టి జాతీయ రహదారిలో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

కొంచెం ఓపిక ఉండి.. అలా అటవీ ప్రాంతాల్లోకి వెళ్తే.. మన కళ్ల ముందే ఆ పండ్లు ప్రత్యక్షమవుతుంటాయి. ఆ విధంగా సీతాఫలం చెట్లు మనకు దర్శనమిస్తుంటాయి. ఈ పండు చూడటానికి కూడా ఆకర్షణీయంగా మృదువుగా ఉంటుంది. అలాంటి మృదు మధురమైన సీతాఫలం సీజన్‌లో మాత్రమే దొరుకుతుంది. సీతాఫలం తినడం వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలగనున్నాయి. సీతాఫలంలో అధిక మోతాదులో సిట్రస్ ఉంటుంది. ఫైబర్ కూడా పుష్కలంగా లభిస్తుంది. విటమిన్ సీ, విటమిన్ బీ6, కాల్షియం, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. దీర్ఘకాలంగా అల్సర్‌తో బాధపడేవారు సీతాఫలాన్ని తింటే త్వరగా కోలుకుంటారు. ఎసిడిటీ సమస్య ఉన్న వారు కూడా ఈ పండును తినొచ్చు. జీవక్రియ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా మనం తీసుకున్న ఆహారాన్ని శక్తిగా మార్చగల సామర్థ్యం కూడా ఈ ఫలానికి ఉంది. ఇక కంటి, గుండె ఆరోగ్యానికి కూడా సీతాఫలం ఎంతో మేలు చేకూరుస్తుంది. కంటి చూపు మెరుగుపడటంతో పాటు, గుండె, మెదడును ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడుతుంది. సీతాఫలంలో సూక్ష్మపోషకాలు పుష్కలంగా లభించడంతో.. చర్మం మృదువుగా ఉండేలా చేస్తుంది. మన రక్తంలోని హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. రక్తహీనత ఉన్నవారు, గర్భధారణ సమయంలో హిమోగ్లోబిన్ లోపం ఉన్న మహిళలు ఈ పండును తినవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఉద్యాన శాఖ
జిల్లా ఉద్యాన అధికారి వారి కార్యాలయం
షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.ఓ.సి.నెం. 37/B/2024 తేది:19-01-2025

చిత్తూరు జిల్లాలోని 8 ఉద్యాన అధికారుల కేంద్రాలకు మామిడి ఫ్రూట్ కవర్లు(28×22సెం.మీ) (టెండర్ షెడ్యూల్లో ఇచ్చిన విధంగా) కొనుగోలు చేసి సరఫరా చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తి గల FPO/FPC సంస్థల వారు దరఖాస్తు రుసుము రూ.2000/-(అక్షరాల రెండు వేల రూపాయలు) జిల్లా ఉద్యాన అధికారి, చిత్తూరు వారి పేరు మీద చిత్తూరులో అన్ని జాతీయ బ్యాంకుల్లో చెల్లుబాటు అగునట్లుగా డి.డి. తీసి టెండరు ఫారాలు 21.01.2025 ఉదయం గం॥ 10.30నిల నుండి 27.01.2025 సాయంత్రం 03.00 గంటల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండర్లు 27.01.2025 సాయంత్రం 03.00 గంటల లోపల ఈ క్రింది అధికారి వారి కార్యాలయములో డ్రాప్ బాక్స్‌లో వేయవలెను. 27.01.2025 తేదీ రోజు జాయింట్ కలెక్టరు వారి కార్యాలయములో సదరు టెండర్లు తెరువబడును. ఇతర వివరాలకు జిల్లా ఉద్యాన అధికారి, చిత్తూరు వారిని సంప్రదించగలరు.

జిల్లా ఉద్యాన అధికారి, చిత్తూరు జిల్లా.

జాయింట్ కలెక్టరు
చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ,
చిత్తూరు జిల్లా.